ప్రజాశక్తి
బుధవారం 3 జులై 2024 5
శ్రీ సత్యసాయి

నూతన కలెక్టర్‌గా టిఎస్‌.చేతన్‌

పల్నాడు జిల్లాకు అరుణ్‌బాబు బదిలీ

నూతన కలెక్టర్‌ టిఎస్‌.చేతన్‌

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్‌

సత్యసాయి జిల్లా కలెక్టర్‌ వి.అరుణ్‌ బాబు పల్నాడు జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. మంగళవారం ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌ కుమార్‌ ప్రసాద్‌ ఉత్తర్వులు జారీ చేశారు. అరుణ్‌ బాబు స్థానంలో సత్యసాయి జిల్లా నూతన కలెక్టర్‌గా టిఎస్‌.చేతన్‌ నియమితులయ్యారు. ఆయన ఏపీ బేవరీస్‌ కార్పొరేషన్‌ మేనేజింగ్‌ డైరెక్టర్‌గా పని చేస్తూ ప్రస్తుతం సత్యసాయి జిల్లా కలెక్టర్‌గా రానున్నారు. టిఎస్‌.చేతన్‌ గతంలో సత్యసాయి జిల్లా జాయింట్‌ కలెక్టర్‌గా కొంతకాలం పనిచేశారు.

8 కళాశాలలకు బ్రేక్‌

- నిబంధనలు లేకపోవడంతో నిరాకరణ
- 58 ఇంజినీరింగ్‌ కళాశాలల్లో అడ్మిషన్లకు అనుమతి
- జెఎన్‌టియుఎ పాలక మండలి నిర్ణయం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

నిబంధనలు సరిగా పాటించని 8 ఇంజినీరింగ్‌ కళాశాలల్లో అడ్మిషన్లను నిలుపుదల చేస్తూ అనంతపురం జెఎన్‌టియు బ్రేక్‌ వేసింది. యూనవర్శిటీ పరిధిలో తక్కిన 58 వాటికి అనుమతులిస్తూ పాలక మండలి సమావేశంలో నిర్ణయం చేసింది. వాస్తవానికి యూనవర్శిటీ పరిధిలో ఉన్నవి మొత్తం 75 కళాశాలలు. ఇందులో అంతకు మునుపే సరిగాలేవని రద్దుచేసినవి తొమ్మిది ఉన్నాయి. అవిపోను ఈ ఏడాది 66 కళాశాలల్లో ఫ్యాక్ట్స్‌ ఫైండింగ్‌ కమిటీ పరిశీలించింది. ఇందులోనూ ఎనిమిది కళాశాలల్లో సరైన ప్రమాణాల్లేవన్నది తేలింది. ఇందులో అనంతపురం జిల్లాలో రెండు, నెల్లూరులో రెండు, చిత్తూరులో ఒకటి, కడపలో ఒకటి, మదనపల్లి రెండు ఇంజనీరింగ్‌ కళాశాలలు ఫైండింగులో ఉన్నాయి. ఎటువంటి లోటుపాట్లు ఇక్కడున్నాయన్నది గుర్తించిన అంశాలను తెలియజేస్తూ పాలకమండలి షోకాజ్‌ నోటీసులు జారీ చేసింది. దీనిపై ఆయా కళాశాలలు ఇచ్చిన వివరణాల అనంతరం తదుపరి చర్యలు ఆధారపడి ఉండనున్నాయి.

కొత్త కోర్సులతో కలిపి 50 వేల వరకు సీట్లు

జెఎన్‌టియు యూనవర్శిటీ పరిధిలో ఉన్న 66 కళాశాలల్లో కలిపి గతేడాది మొత్తం 43 వేల సీట్లు ఉండేవి. ఈ ఏడాది యూనవర్శిటీలో కొత్త కంప్యూటర్‌ కోర్సులు పెంచడంతో అవి దాదాపు 50 వేల వరకు చేరాయి. ఇందులో ఇప్పుడు అడ్మిషన్లకు అనుమతులు రానివి వరకు చూస్తే సుమారు రెండు వేల పైచీలుకు సీట్లు రద్దయ్యే అవకాశం ఉంటుంది. సీట్లు ఉన్న కొన్ని కోర్సుల్లో అడ్మిషన్లు తక్కువగా ఉండే పరిస్థితులు కనిపిస్తున్నాయి. దీంతో చాలా వరకు మిగిలిపోతూ వస్తున్నాయి. ఈ ఏడాది ఎన్ని సీట్లు భర్తీ అవుతాయన్నది చూడాల్సి ఉంది.

మొదలైన రిజిస్ట్రేషన్‌ ప్రక్రియ

ఇంజినీరింగ్‌ కళాశాలలకు సంబంధించి రిజిస్ట్రేషన్‌ ప్రక్రియ కూడా ప్రారంభమైంది. జులై 1వ తేదీ నుంచే ఆన్‌లైన్‌ రిజిస్ట్రేషన్‌ ప్రారంభమయ్యాయి. జులై 7వ తేదీతో రిజిస్ట్రేషన్‌ ప్రక్రియ ముగియనుంది. జులై 4వ తేదీ నుంచి 10వ తేదీ వరకు హెల్ప్‌లైన్‌ సెంటర్‌లో అప్‌లోడేడ్‌ సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ జరుగుతుంది. జులై 8నుంచి 12వ తేదీ వరకు వెబ్‌ ఆప్షన్‌లో కళాశాలల ఎంపిక చేసుకునేందుకు అవకాశం ఉంది. మార్పులు, చేర్పులుంటే జులై 13వ తేదీ వరకు అవకాశం ఉంటుంది. జులై 16వ తేదీన సీట్ల నిర్ధారణ పూర్తవుతుంది. జులై 17 నుంచి 22వ తేదీలోపు సీట్లు పొందిన విద్యార్థులు ఆయా కళాశాలల్లో రిపోర్టు చేసుకోవాలి. జులై 19వ తేదీ నుంచి కళాశాలలు ప్రారంభమవుతాయి.

నిబంధనలు పాటించిన వాటికే అనుమతి

ఫ్యాక్ట్స్‌ ఫైండింగ్‌ కమిటీ నివేదిక ఆధారంగా నిబంధనలు పాటిస్తున్న కళాశాలలకే అడ్మిషన్లకు అనుమతినివ్వాలని పాలకమండలి నిర్ణయం తీసుకుంది. అందుకు అనుగుణంగానే కళాశాలలకు సీట్ల కేటాయింపులు జరిగాయి. ఈ ఏడాది ఎఐసిటిఇ కంప్యూటరు సైన్సులో కొత్త కోర్సులు చేపట్టింది. దీంతో అదనంగా ఏడు వేల సీట్లు కూడా పెరగనున్నాయి. అడ్మిషన్ల ప్రక్రియ కూడా ప్రారంభమైంది. ఇప్పటికే ప్రభుత్వం షెడ్యూల్‌ను ప్రకటించింది. దానికి అనుగుణంగా యూనివర్శిటీ పరిధిలోనూ అడ్మిషన్లు మొదలయ్యాయి. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పారదర్శకంగా కౌన్సిలింగ్‌ ప్రక్రియ జరిగే విధంగా అన్ని రకాల చర్యలు తీసుకున్నాం.

ఆచార్య ఎస్‌వి.సత్యనారాయణ, జెఎన్‌టియు ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌.

ప్రభుత్వ ఆదాయం (లే)అవుట్‌..!

దుద్దేబండ వద్ద వెలసిన లేఅవుట్‌

పెనుకొండలో అనధికార లేఅవుట్లు ఇష్టారాజ్యంగా వెలిశాయి. రియల్టర్లు నిబంధనలకు పాతరేస్తూ ప్రభుత్వ ఆదాయనికి భారీగా గండి కొడుతున్నారు. అడిగేవారే లేరా.. అన్నట్లు ప్లాట్లు వేసి అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. అయినా సంబంధిత అధికారులు తమకేమీ తెలియదనట్లు వ్యవహరిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. కంటితుడుపు చర్యలుగా నామమాత్రపు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

- అనధికార లేఅవుట్లు.. ఆదాయానికి చిల్లు..
- పెనుకొండలో రియల్టర్ల ఇష్టారాజ్యం
- పుట్టగొడుగుల్లా వెంచర్లు
- అహుడా, పంచాయతీ ఆదాయనికి గండి
- చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్‌

కియ పరిశ్రమ ఏర్పాటుతో పెనుకొండ మండలంలో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. దీన్ని అసరాగా చేసుకుని రియల్టర్లు ఇష్టారాజ్యంగా అక్రమ లేఅవుట్లు వేసి ప్లాట్లు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. తద్వారా అహుడా, పంచాయతీల ఆదాయానికి భారీగా గండికొడుతున్నారు. పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని సర్వేనెంబర్‌ 453.2ఎ,3ఎ,453.3ఎ, 196.4లో దాదాపు 26 ఎకరాల్లో లేఅవుట్‌ వేసి అమ్మకాలు చేశారు. మండల పరిధిలోని దుద్దెబండ గ్రామ పరిధిలోని సర్వేనెంబర్‌ 454లో ఏకంగా 50 ఎకరాల్లో అనధికార లేఅవుట్‌లో ప్లాట్లు వేసి విక్రయాలు చేస్తున్నారు. అమ్మవారి పల్లి వద్ద 44వ జాతీయ రహదారి పక్కనే మునిమడుగు పొలం సర్వేనెంబర్‌ 452.1ఎ,452.3లో 3.80 ఎకరాల భూమిని గతంలో ఓ కార్పొరేట్‌ కంపెనీ కొనుగోలు చేసింది. అందులో 2.80 ఎకరాల బూమిని రియల్‌ వ్యాపారులకు అమ్మేసింది. ఈ భూమిలో ప్రస్తుతం ప్లాట్లు వేసి అమ్మకానికి పెట్టారు. సెంటు భూమి రూ.10లక్షల నుంచి రూ.12 లక్షల వరకు విక్రయిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు.

అమ్మవారుపల్లి జాతీయరహదారిపక్కన వెలసిన లేఅవుట్‌

నిబంధనలు పాటించని రియల్‌ వ్యాపారులు...

నూతనంగా లేఅవుట్‌ ఏర్పాటు చేయాలంటే ఆహుడా అనుమతి కోసం దరాఖాస్తు చేసుకోవాలి. తాజా నిబంధనలు ప్రకారం అంతర్గత దారులు 40 అడుగులు, ప్రధాన రోడ్డు 60 అడుగులు, రోడ్లు, ఇతర మౌలిక వసతుల ఏర్పాటు, సామాజిక అవసరాలకు 10 శాతం స్థలాన్ని రిజర్వ్‌ చేయాల్సి ఉంది. వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా భూమి కన్వర్షన్‌ చేసుకునే వ్యక్తి లేఅవుట్‌ ఫీజు, భూమి వినియోగ మార్పిడి, డెవలప్‌మెంట్‌ ఛార్జీలు, ప్రాసెసింగ్‌ ఫీజు, ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంది. సామాజిక అవసరాలక పదిశాతం ఖాళీ స్థలాన్ని వదలి, దారులు నిర్మించాలి. నిబంధనలు గాలికి వదిలేసి ఇష్టారాజ్యంగా లే అవుట్లు వేసి అడ్డగోలుగా విక్రయాలు చేస్తున్నారు. దీంతో పంచాయతీ, మున్సిపల్‌ ఆదాయాని గండిపడుతోంది.

చర్యలు తీసుకుంటాం..

పెనుకొండ, పరిసర ప్రాంతాల్లో అనధికార లేఅవుట్లును పరిశీలించి చర్యలు తీసుకుంటామని మున్సిపల్‌, పంచాయతీ అధికారులు అన్నారు. అక్రమ లేఅవుట్ల ఏర్పాటు చేసిన వారికి నోటీసులు ఇచ్చి, చర్యలు తీసుకుంటామన్నారు.

శెట్టూరు సచివాలయ 'వెల్ఫేర్‌' చేతివాటం

రూ.5.45 లక్షల పింఛను సొమ్ము స్వాహా

ప్రజాశక్తి-శెట్టూరు

శెట్టూరు మండల కేంద్రంలోని సచివాలయంలో పని చేసే వెల్ఫేర్‌ చేతివాటం ప్రదర్శించారు. ఏకంగా పేదలకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నుంచి వచ్చిన ఎన్టీఆర్‌ భరోసా పింఛన్ల సొమ్మును కాజేశాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. శెట్టూరు మండల కేంద్రంలోని సచివాలయంలో ఎడ్యుకేషన్‌ అండ్‌ వెల్ఫేర్‌ అసిస్టెంట్‌గా మల్లికార్జున పని చేస్తున్నాడు. ఈయన మంగళవారం నాడు ఎన్టీఆర్‌ భరోసా పింఛన్ల పంపిణీకి సంబంధించిన నగదును డ్రా చేసుకున్నాడు. ఇందులో భాగంగా పలు ప్రాంతాల్లో పింఛన్‌ దారులతో వేలిముద్రలు వేయించుకుని డబ్బులు మధ్యాహ్నం తరువాత ఇస్తానని చెప్పాడు. మధ్యాహ్నం అయినా అతను ఇవ్వకుండా తప్పించుకుని తిరిగాడు. బుధవారం ఉదయం తమ డబ్బును సచివాలయ వెల్ఫేర్‌ కాజేశాడని తెలుసుకున్న లబ్ధిదారులు ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. దీంతో విషయం తెలుసుకున్న ఎంపిడిఒ ఇతర అధికారులు వేల్ఫేర్‌ను పిలిపించి మాట్లాడారు. పింఛన్‌ సొమ్ము వాడుకున్న వాస్తవమే అని అతను అంగీకరించాడు. ఈసందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ పింఛన్లకు సంబంధించి మల్లికార్జున రూ.5.45 లక్షలు తన సొంతానికి వాడుకున్నట్లు అంగీకరించాడని చెప్పారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. పింఛన్‌ దారులకు నష్టం జరగకుండా వారికి నగదు పంపిణీ చేసేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు : కలెక్టర్‌, ఎస్పీ

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్‌

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ అరుణ్‌ బాబు, ఎస్పి ఎస్‌వి.మాధవరెడ్డిలు అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి క్లైమ్‌ సెటిల్మెంట్‌, రోడ్డు సేఫ్టీ కమిటీల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి కరుణ సాగర్‌ రెడ్డితోపాటు రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ ప్రమాదాల మరణాలు తగ్గించాలన్నారు. మద్యం సేవించి వాహనాలను నడిపే వారి మీద కేసులు నమోదు చేసి జైలు శిక్ష పడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదాలు తరచూ జరిగే ప్రదేశాలను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. హెల్మెట్‌ ధరించకుండా వాహనాలు నడిపే వారిపై పోలీస్‌, రవాణా శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అందరూ సమిష్టిగా కృషిచేసి ప్రమాదాలను తగ్గించాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ జాతీయ రహదారుల పైన డాబాల దగ్గర వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకోవాలన్నారు. హెల్మెట్‌ లేకుండా వాహనాలు నడిపే వారి పైన, మద్యం సేవించి నడిపే వారిపై కేసులు నమోదు చేయాల్సిందేనన్నారు. ఈ కార్యక్రమంలో మోటార్‌ వెహికల్‌ ఇన్స్‌పెక్టర్‌ నాగేంద్ర నాయక్‌, డీఈవో కార్యాలయ అసిస్టెంట్‌ డైరెక్టర్‌ రామకృష్ణ, కమిషనర్లు రంగస్వామి, కిరణ్‌ కుమార్‌, వంశీకృష్ణ, భార్గవి, ఆర్టీసీ జిఎం మధుసూదన్‌, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వెండి రథంపై శ్రీవారి ఊరేగింపు

స్వామి వారి ఆశీర్వాదం తీసుకుంటున్న ఆలయ ఈవో

ప్రజాశక్తి-కదిరి అర్బన్‌

పట్టణంలో వెలసిన ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి మంగళవారం వెండి రథంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి ఉదయం ప్రత్యేక హోమాలు, అభిషేకాలు చేసి ప్రత్యేక అలంకరణ చేశారు. స్వామివారిని దర్శించుకోవడానికి పెద్దఎత్తున భక్తులు తరలిరాగా అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. రథోత్సవంలో ప్రధాన అర్చకులు, ఆలయ ఈవో శ్రీనివాస్‌రెడ్డి భక్తులు పాల్గొన్నారు.

'అమరావతి'కి వికలాంగురాలి విరాళం

పజాశక్తి-మడకశిర

ఎపికి రాజధాని అమరావతి అభివృద్ధి కోసం గుడిబండ మండలం తాళికెర పంచాయతీ లోని బాలదిమ్మనపల్లి గ్రామానికి చెందిన అన్నపూర్ణమ్మ మంగళవారం రూ. 5వేలు విరాళంగా ఇచ్చింది. ఈమెను భర్త వదిలేయడంతో పుట్టింట్లోనే తల్లి దగ్గర ఉంటోంది. వికలాంగురాలు కావడంతో రూ. 15వేలు పింఛను రావడంతో అందులో రూ. 5వేలను రాజధాని నిర్మాణం కోసం విరాళంగా ఇచ్చింది.

శ్రీకృష్ణదేవరాయలు విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్‌

మండలంలోని గొట్లూరు గ్రామంలో శ్రీకృష్ణదేవ రాయలు విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కోరుతూ గ్రామ బలిజ సంఘం ఆధ్వర్యంలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద పాత అంగన్వాడీ కేంద్రం శిథిలావస్థకు చేరుకుందని, ఆ స్థలాన్ని కేటాయించాలని కోరారు. స్పందించిన చిలకం ఈ విషయాన్ని మంత్రి సత్యకుమార్‌ దృష్టికి తీసుకెళ్లి స్థలం ఇప్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



చిలకంకు వినతిపత్రం ఇస్తున్న బలిజ సంఘం నాయకులు

రేపు దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్‌

విజయవంతం చేయాలని విద్యార్థి సంఘాల పిలుపు

గోడ పత్రికలను విడుదల చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్‌

నీట్‌, నెట్‌ పరీక్షల పేపర్ల లీకేజీలను నిరసిస్తూ ఈ నెల 4వ తేదీన దేశవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌ను నిర్వహిస్తున్నట్లు విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. మంగళవారం నాడు ఎస్సీ సంక్షేమ వసతి గృహంలో బంద్‌కు సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ, ఎఐఎస్‌ఎఫ్‌, ఎఐఎస్‌ఎ, పిఒఎస్‌యు, ఎన్‌ఎస్‌యుఐ జాతీయ ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీరేష్‌, నాగార్జున, ఎఐయుఎస్‌ఎఫ్‌ జిల్లా కార్యదర్శి నల్లజోడు పవన్‌ తదితరులు మాట్లాడుతూ నేషనల్‌ టెస్టింగ్‌ ఏజెన్సీ పరీక్షలు నిర్వహించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందన్నారు. నీట్‌ పరీక్ష లీకేజ్‌ కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్‌ చేశారు. అప్రజాస్వామ్యంగా విద్యార్థి వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా చేపడుతున్న దేశవ్యాప్త బంద్‌కు ప్రయివేటు పాఠశాలల యాజమాన్యం సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ విద్యార్థి సంఘాల జిల్లా నాయకులు శివకుమార్‌, రంజిత్‌, సాయినాథ్‌ రెడ్డి, నరేష్‌, నవీన్‌, ప్రతాప్‌ పాల్గొన్నారు.

హిందూపురం : నీట్‌ పరీక్ష పేపర్‌ లీకేజికి సంబంధించి అసమర్థ ఎన్‌టియును రద్దు చేయాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్‌ చేస్తూ ఈ నెల 4వ తేదీన కేజీ నుంచి పీజీ వరకు జరిగే విద్యా సంస్థలు బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి, ఎఐఎస్‌ఎఫ్‌ జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహమూర్తి, నాగభూషణం తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఇందిరా పార్కులో విద్యా సంస్తల బంద్‌కు సంబంధించిన గోడ పత్రికలను విడుదల చేశారు. నెట్‌, నీట్‌ పరీక్షలు రాసి, నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు జయచంద్ర, చంద్రశేఖర్‌, తరుణ్‌, జస్వంత్‌, పవన్‌, రాజా, హుస్సేన్‌, అశోక్‌, నిహల్‌, ఎఐఎస్‌ఎఫ్‌ పవన్‌, చరణ్‌, నంద కిషోర్‌ రెడ్డి, మునాక్‌, నితిన్‌, భానుప్రసాద్‌ పాల్గొన్నారు.

ధర్మవరాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యం

అధికారులతో మంత్రి సత్యకుమార్‌ యాదవ్‌

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్‌

అన్నిశాఖల సహకారంతో ధర్మవరాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతానని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌ తెలియజేశారు. మంగళవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో నియోజకవర్గం అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఆర్డీవో వంశీకృష్ణ, మున్సిపల్‌ కమిషనర్‌ రాంకుమార్‌ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే వివిధ సంక్షేమ పథకాల అములుపై పూర్తి స్థాయి నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈనెల 9 నుంచి 11వతేదీ వరకు సంబంధిత శాఖ అదికారులతో నియోజకవర్గ అభివద్ధిపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధుల ఖర్చుపై సమగ్రనివేదికలు సిద్ధం చేయాలన్నారు. గ్రామాల్లో డ్రెయినేజీ, నీరు, విద్యుత్‌ సమస్యలతోపాటు గహనిర్మాణాలు ఇంటి సమస్యల పరిష్కారానికి అధికారులందరూ సమిష్టిగా పని చేయాలన్నారు. నియోజకవర్గంలో నేతన్నలు అధికంగా ఉన్నారని వారి అభివృద్ధికి కేంద్రం నుంచి అధిక మొత్తంలో నిధుల మంజూరుకు తన వంతు కషిచేస్తానని చెప్పారు. నియోజకవర్గంలో 6వేల మంది అంగవైకల్యంతో బాధపడుతున్నారని తెలిపారు. పక్షవాతం సమస్యతో ఉన్న వారూ ఉన్నారన్నారు. ఇలాంటి వారి కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వైద్యశాఖ అధికారిణి మంజులవాణిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ మీనాక్షి, డీఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్‌ మంజులవాణి, విద్యుత్‌ శాఖ ఎస్‌ఈ సుధాకర్‌, జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు, హ్యాండ్లూమ్‌ టెక్స్‌టైల్‌ జిల్లా ఏడీ రమేశ్‌ పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్‌యాదవ్‌

కదిరి మున్సిపాల్టీలో ఆగని పైసా వసూల్‌..!



కార్యాలయంలో డబ్బులు తీసుకుంటున్న అధికారి

- మితిమీరుతున్న వసూళ్ల రాజా ఆగడాలు
- సిడిఎంఎ కార్యాలయం నుంచి షోకాజ్‌ నోటీసులు ?
- చర్యలు తీసుకోవడంలో మీనమేషాలు..!

ప్రజాశక్తి-కదిరి టౌన్‌

కదిరి మున్సిపాల్టీ అవినీతికి కేంద్ర బిందువుగా తయారైందనే విమర్శలు కొనసాగుతూనే ఉన్నాయి. కొందరు అధికారుల తీరుతో మున్సిపాల్టీపై తరచూ విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అక్రమ వసూళ్ల విషయంలో ఓ అధికారి ఆగడాలుకు అడ్డేలేకుండా పోతోంది. మున్సిపాల్టీలో చోటు చేసుకున్న అవినీతి బాగోతంపై గతంలో పలుమార్లు ప్రజాశక్తిలో కథనాలు వెలువడ్డాయి. ఈ వరుస కథనాలు ఉన్నతాధికారులు దృష్టికి వెళ్లడంతో సిడిఎంఎ కార్యాలయం నుంచి ఆ అధికారులకు షోకాజ్‌ నోటీసులు ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. ఇంత జరుగుతున్నా ఆ అధికారిలో మార్పు కనపడకపోగా యథేచ్ఛగా ఏకంగా కార్యాలయలంనే వసూళ్లకు దిగుతున్నారు. తాజాగా బుధవారం సాయంత్రం మున్సిపల్‌ కార్యాలయంలో సదురు అధికారి ఓ పని నిమిత్తం ప్రయివేటు వ్యక్తి నుంచి రూ.35వేలు నగదు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి ఘటనలు మున్సిపాల్టీలో నిత్యం జరుగుతూనే ఉన్నారు.

గతం నుంచి ఆరోపణలే..!

కదిరి మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులు గతంలో వివిధ కారణాలతో మతి చెందారు. కార్మికుల బీమా మంజూరులో మున్సిపాల్టీలో ఓ అధికారి లంచాల పర్వానికి తెరలేపారు. బీమా సొమ్ము రావాలంటే కార్మికులు ఒక్కొక్కరితో డబ్బులు ఇప్పించుకునేలా బేరం కుదుర్చుకుని అందనికాడికి దోచుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అవినీతి బాగోతంపై ప్రజాశక్తిలో కథనం వెలువడింది. దీంతో రంగంలోకి దిగిన సదరు అధికారి కార్మికులను బెదిరించి తాము ఎవరికీ డబ్బులు ఇవ్వలేదన్నట్లు తెల్ల కాగితంపై సంతకాలు, వేలిముద్రలు పెట్టించుకున్నట్లు తెలుస్తోంది. ఇదే విషయంపై మరోమారు కథనం ప్రచురితం కావడంతో చేసేది లేక కార్మికులకు తిరిగి కొంత మొత్తం చెల్లించి సమస్యను బయటకు రాకుండా చేసుకున్నారు. ఇదే విధంగా మున్సిపల్‌ పరిధిలోని ఓ సచివాలయంలో పనిచేసే మహిళ చిరుద్యోగి తన కొడుకుకు పక్క జిల్లాలో పరీక్ష రాయించేందుకు గాను మున్సిపల్‌ కమిషనర్‌ను ఒకరోజు సెలవు అడిగారు. ఎన్నికలు వేల సెలవు మంజూరు చేయడం కుదరదని మున్సిపల్‌ ఉన్నతాధికారి తెలిపారు. కుమారుడు పరీక్ష హాజరు నిమిత్తం చేసేదిలేక సదురు మహిళా ఉద్యోగి కుమారుడిని వెంట పెట్టుకుని వెళ్లక తప్పలేదు. దీనిని ఆసరగా చేసుకుని ఆ ఉద్యోగినికి విచారణ పేరుతో షోకాజ్‌ నోటీస్‌ జారీ చేసినట్లు తెలుస్తోంది. షోకాజ్‌ నోటీసు పేరుతో ఉద్యోగినిని బెదిరింపులకు గురి చేసి అధికారి వసూళ్ల పర్వానికి తెరలేపాడు. ఆ ఉద్యోగి చేసిది లేక రూ.4వేలు ఇవ్వడానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది. అయితే రూ.4 వేలు చాలదని, రూ.10వేలు కావాలంటూ డిమాండ్‌ చేసినట్లు సమాచారం. ఇలా వసూళ్ల పర్వానికి శ్రీకారం చుట్టిన ఆ అధికారి బాగోతంపై సంబంధిత ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అవినీతి అధికారుల బాగోతంపై విచారణ జరిపి మున్సిపాల్టీలో అవినీతి అధికారిపై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు

కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

కేంద్ర ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని లేనిచో భవిష్యత్తు లో ఉద్యమాలు చేపడతామని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు హెచ్చరించారు. మండలంలోని మహమ్మదాబాద్ క్రాస్‌లో మంగళవారం సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ అధ్యక్షతన విద్యా వైజ్ఞానిక అవగాహన, శిక్షణ తరగతులు నిర్వహించారు. ముందుగా సిఐటియు సీనియర్ నాయకులు వివి రమణ జెండాను ఆవిష్కరించారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ సిఐటియు విశిష్టత, పోరాటాలు, ఉద్యమాలు, అనుభవాలు, తదితర అంశాలపై బోధించారు. అనంతరం ఓబులు విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లేబర్ చట్టాలు అమలు చేయాలని, కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిచో రాబోయే కాలంలో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు కుళ్లాయప్ప, కార్యదర్శి శ్రీరాములు, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు, భవననిర్మాణ కార్మిక సంఘం నాయకులు, అంగన్వాడీ ప్రాజెక్టు, సెక్టార్ లీడర్లు, స్వచ్ఛభారత్ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎస్‌డిఆర్‌ఆర్ కళాశాలలో ఉద్యోగమేళా

ముదిగుబ్బ : స్థానిక ఎస్‌డిఆర్‌ఆర్ కళాశాలలో బుధవారం(నేడు) 'కనెక్ట్ బిజినెస్ సొల్యూషన్ లిమిటెడ్' కంపెనీ ఆధ్వర్యంలో ఉద్యోగమేళా(క్యాంపస్ డ్రైవ్) నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ప్రకాష్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన డిగ్రీ పూర్తి చేసిన, ఫైనల్ ఇయర్ స్టూడెంట్స్ జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని ప్రిన్సిపల్ తెలిపారు.

ఐటిఐ విద్యార్థులకు ఉద్యోగావకాశాలు

ముదిగుబ్బలోని ఇబ్రహీంపట్నం ఐటిఐ కళాశాలలో బుధవారం(నేడు) మారుతి సుజుకి కంపెనీ ఆధ్వర్యంలో ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఓ ప్రకటనలో తెలిపారు. ఐటిఐ పూర్తి చేసిన విద్యార్థులు జాబ్‌మేళాకు హాజరు కావాలని ప్రిన్సిపల్ తెలిపారు. ఎంపికైన వారికి అనంతపురం, హిందూపురం, కదిరి ప్రాంతాల్లో ఉద్యోగం కేటాయిస్తారని, నెలకు రూ. 15వేల వేతనం ఉంటుందన్నారు. వివరాలకు 9014219369 నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

నిలిచిపోయిన వారపు సంత వేలం

సోమందేపల్లి : స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం చేపట్టిన వారపు సంత, దిన మార్కెట్ వేలంను నిలిపేశారు. సర్పంచి గంగాదేవి, ఉప సర్పంచి వేణు, ఈఓఆర్‌డీ శ్రీధర్, పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు ఆధ్వర్యంలో వారపు సంత, దిన మార్కెట్ వేలం పాట చేపట్టారు. బైలా ఎక్కువ ఉందన్న కారణంతో డిపాజిట్‌దారులు వేలం పాట పాడకపోవడంతో వేలం నిర్వహణను నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శి వివరణ

సుమారు 18 మంది డిపాజిట్ కట్టారని,నిబంధనల మేరకు 9 నెలల కాలానికి వారపు సంతకు రూ. 18 లక్షలు, దిన మార్కెట్‌కు రూ. లక్ష బైలా నిర్ణయించామన్నారు. బైలా ఎక్కువ ఉండడంతో డిపాజిట్‌దారులు వేలం పాట పాడలేదని, దీంతో ఉన్నతాధికారులు సూచనల మేరకు వేలం నిర్వహణను నిలిపివేశామన్నారు. ఉన్నతాధికారుల సూచనల అనంతరం ప్రజలకు తెలిపి తదుపరి వేలం పాట నిర్వహిస్తామని పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు తెలిపారు.

కార్మికుల నిరాహార దీక్షలకు మద్దతు తెలుపుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు

ప్రజాశక్తి-పరిగి

పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడమే కాకుండా వారికి రావాల్సిన వేతన బకాయిలను తక్షణమే చెల్లించాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. స్థానిక సచివాలయం వద్ద పంచాయతీ, స్వచ్ఛభారత్ కార్మికులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలకు మంగళవారం ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. చాలీచాలని వేతనాలు ఇస్తూ పంచాయతీ కార్మికులతో వెట్టిచాకిరీ చేయిస్తున్న అధికారులు తక్షణమే వారికి బకాయి వేతనాలు ఇవ్వాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. పరిగి పంచాయతీలో పని చేస్తున్న కార్మికులకు పోస్ట్ శాంక్షన్ రెన్యువల్ చేయాలని, 11 నెలల అరియర్స్ ఇవ్వాలని, నూనె, సబ్బులు, చెప్పులు తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్మికుల సమస్య లు పరిష్కరించేంత వరకూ సమ్మె కొనసాగిస్తామని తేల్చి చెప్పారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సజ్జరాయప్ప, నాయకులు మూర్తప్ప, రామంజి, కార్మికులు పాల్గొన్నారు.

అన్యాక్రాంత భూములపై కమిషనర్‌కు వినతి

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

మున్సిపాలిటీలో అన్యాక్రాంతమైన భూములపై చర్యలు తీసుకోవాలని జనసేన, టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కమిషనర్ అంజయ్యకు వినతిపత్రం సమర్పించారు. నాయకులు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో పలుచోట్ల కొందరు దర్జాగా ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటున్నారని, వాటిపై విచారణ చేయాలని కమిషనర్‌ను కోరామన్నారు. త్వరలో ప్రశాంతి నిలయంలో జరిగే గురుపౌర్ణమి వేడుకలకు వచ్చే దేశ, విదేశీ భక్తులకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించాలని కోరారు. వీధి లైట్లు, పారిశుధ్యం చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి బొగ్గరం శ్రీనివాసులు, టిడిపి నాయకుడు, కౌన్సిలర్ రత్నప్ప చౌదరి, జనసేన నాయకులు మారుతి, రాము, గణేష్ పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే

హిందూపురం : రూరల్ మండలంలోని బీరేపల్లి పంచాయతీలోని పి.గుడ్డంపల్లి అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సరస్వతి, శాంతి, అనిత, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ప్రమీళ పాల్గొని మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రంలో ఐదేళ్లు పైబడిన చిన్నారులను ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేర్పించేందుకు ప్రభుత్వం గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తుందన్నారు. అంగన్వాడీ కేంద్రాల పరిధిలోని చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రయివేట్ పాఠశాలలకు దీటుగా అంగన్వాడీ కేంద్రాలలో ఆంగ్ల విద్య అందిస్తున్నారని తెలిపారు. మూడేళ్లు పైబడిన పిల్లలను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించే బాధ్యత ప్రతి తల్లిదండ్రులపై ఉందన్నారు. హెచ్‌ఎం ప్రమీళ మాట్లాడుతూ ఆరేళ్లు నిండిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్చాలని, అక్కడి సదుపాయాలను తల్లిదండ్రులకు వివరించారు. అనంతరం కొత్తగా నమోదైన మూడేళ్ల పిల్లల చేత సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు.

సిఎం, డిప్యూటీ సిఎం చిత్రపటాలకు పాలాభిషేకం

బుక్కపట్నం : సామాజిక పింఛనుదారుల జీవితాల్లో వెలుగులు నింపి వారికి భరోసా కల్పించిన ఘనత సిఎం చంద్రబాబుకే దక్కుతుందని పలువురు పింఛనుదారులు పేర్కొన్నారు. వికలాంగ, పెరాలసిస్, వృద్ధాప్య పింఛన్లను రెట్టింపు చేసినందుకు పెరాలసిస్ పింఛనుదారుడు సూరి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తేరు కూడలిలో పింఛనుదారులు సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి, స్వీట్లు పంచిపెట్టారు. పింఛనుదారులు మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లను పెంచి వృద్ధులకు భరోసానిచ్చి వారిని అన్ని విధాలుగా ఆదుకున్నారని తెలిపారు. దేశంలో మొట్టమొదటిసారిగా పింఛన్ల పంపిణీ కార్యక్రమం మొదలుపెట్టింది ఎన్టీఆర్ అని, తిరిగి చంద్రబాబు సారథ్యంలో పింఛను సొమ్ము పెంచారని కొనియాడారు. కార్యక్రమంలో పింఛనుదారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పాడి ఆవుల మృత్యుఘోష

రూ. లక్షల్లో నష్టం.. ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండలంలోని తుంగోడు, పత్తికుంటపల్లి పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో రూ. లక్షల విలువ చేసే పాడి ఆవులు మృత్యువాత పడుతుండడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. బాధిత పాడి రైతుల వివరాల మేరకు.. రూ. 60 వేల విలువ చేసే పాడి ఆవు, రూ. 20 వేల విలువ చేసే రెండు దూడలు మంగళవారం మృతి చెందినట్లు కొలింపల్లి గ్రామానికి చెందిన బాధిత రైతు రామాంజనేయులు ఆవేదన వ్యక్తం చేశాడు. పత్తికుంటపల్లి గ్రామానికి చెందిన దళిత రైతు గట్ల చిన్న నరసింహప్పకు చెందిన రూ. 60 వేల విలువ చేసే పాడి ఆవు గత సోమవారం మృత్యువాత పడింది. ఇక పత్తికుంటపల్లి గ్రామంలో రైతు భాస్కర్‌రెడ్డికి చెందిన పాడి ఆవులు రెండు వారాల క్రితం మృతి చెందాయి. అతివృష్టి, అనావృష్టి కారణాలతో వ్యవసాయం భారంగా మారడంతో చాలా మంది రైతులు పాడి పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. రూ. లక్షలు అప్పులు చేసి పాడి ఆవులు కొనుగు చేస్తుండగా ఇలా మృత్యువాత పడుతుండడంతో అప్పులు ఎలా తీర్చాలి, కుటుంబాలను ఎలా పోషించా లో తెలియక బాధిత రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. మృత్యువాత పడిన ఆవులకు ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

నేడు గురక వ్యాధి నివారణ టీకా వేస్తాం : మండల వైద్యాధికారి బాలాజీ

మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో పాడి ఆవులు మృత్యువాత పడుతున్న ఘటనపై మండల వైద్యాధికారి బాలాజీనాయక్‌ను ప్రజాశక్తి ఫోన్ ద్వారా వివరణ కోరగా పాడి ఆవులు మృతి చెందిన సంబంధిత రైతులను కలిసి వివరాలు సేకరించామన్నారు. మృతిచెందిన ఆవులకు సంబంధించిన శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపించామని, ల్యాబ్ నుంచి వచ్చిన ఫలితాల తర్వాత పూర్తి వివరాలు తెలియజేస్తామన్నారు. మృతిచెందిన ఆవులు మేసిన గడ్డిని ఇతర పశువులకు వేయరాదని, ఆవులు ఉన్న ప్రాంతాలను తరచూ శుభ్రం చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఇలాంటి లక్షణాలు ఏ ఆవుల్లోనైనా కనబడితే వెంటనే తమకు సమాచారం అందించాలని తెలిపారు. ల్యాబ్ ఫలితాలు ఆలస్యం కానున్న నేపథ్యంలో ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో మంగళవారం ఏడి శ్రీనివాసరావు, డిడి పెంచలయ్య ఆవుల కళేబరాలను పరిశీలించి, బాధిత రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆవులు గురక వ్యాధితో చనిపోయినట్లు ప్రాథమిక నిర్ధారణ చేశామని, ఆయా గ్రామాల్లో బుధవారం(నేడు) పశువులకు వ్యాధికి సంబంధించిన టీకాలు వేస్తామని వైద్యాధికారి బాలాజీ నాయక్ తెలిపారు.

ఆవుల కళేబరాలను పరిశీలిస్తున్న ఏడి శ్రీనివాసరావు, డిడి పెంచలయ్య

'పరిటాల' పోరాటాలు, త్యాగాలు మరువలేనివి

రవి ఘాట్‌ను సందర్శించిన మంత్రులు సత్యకుమార్, సవిత

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ప్రాణాలు పణంగా పెట్టి పోరాడిన పరిటాల రవీంద్ర నిప్పుకణిక లాంటి వారని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ పేర్కొన్నారు. సత్యకుమార్‌తో పాటు బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత మంగళవారం రామగిరి మండలంలోని వెంకటాపురం గ్రామం వెళ్లి పరిటాల రవి ఘాట్‌ను సందర్శించారు. వారికి మాజీ మంత్రి పరిటాల సునీత, ధర్మవరం టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ ఘన స్వాగతం పలికారు. ముందుగా వారు గ్రామంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పరిటాల వరి ఘాట్‌ను సందర్శించి నివాళులర్పించారు. మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ పరిటాల రవి అంటే వ్యక్తి కాదని.. వ్యవస్థలా బతికారన్నారు. పెత్తందారులు, భూస్వాములకు వ్యతిరేకంగా చేసిన పోరాటాలు ఎప్పటికీ మర్చిపోలేమన్నారు. రాజకీయాల్లో సరికొత్త ఒరవడితో ముందు కెళ్లారన్నారు. ధర్మవరంలో అరాచక శక్తులతో పోరాడి ప్రజలకు అండగా నిలిచారన్నారు. నేటికీ ధర్మవరంలో పరిటాల రవి పేరు చెబితే ప్రజల మొహంలో చిరునవ్వు, ధైర్యం కనిపిస్తాయన్నారు. ఆయన పెనుకొండ, ధర్మవరం, రాప్తాడు ప్రజల కోసం ఎంతో చేశారన్నారు. ఆయన లక్షణాలను పరిటాల శ్రీరామ్ పుణికి పుచ్చుకున్నారన్నారు. శ్రీరామ్ తండ్రి బాటలో నడుస్తూ ప్రజలకు అండగా విలువలతో కూడిన రాజకీయాలు చేస్తున్నారన్నారు. ధర్మవరం, రాప్తాడు ప్రజల సమస్యల పరిష్కారానికి, ఈ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. వెంకటాపురం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని మంత్రికి గ్రామస్థులు వినతి పత్రం అందజేశారు. స్పందించిన మంత్రి త్వరలో ఇక్కడ ఆసుపత్రి ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

పరిటాల రవి ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే సునీత, శ్రీరామ్

'బాల్య వివాహ వ్యవస్థను రూపుమాపుదాం'

ప్రజాశక్తి-రొద్దం

ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు సమిష్టిగా పని చేసినప్పుడే బాల్య వివాహ వ్యవస్థను రూపు మాపవచ్చునని పెనుకొండ ప్రాజెక్ట్ మహిళా శిశు అభివృద్ధి పథక అధికారిణి శాంతలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆర్‌డిటి, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో టీం లీడర్ ఆదినారాయణ అధ్యక్షతన 'బాల్య వివాహాలను అరికడదాం.. ఆడబిడ్డలను కాపాడుదాం' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఐసిడిఎస్ అధికారిణి శాంతలక్ష్మి, ఆర్‌డిటి మడకశిర రీజినల్ డైరెక్టర్ మల్లికార్జున, తహశీల్దార్ లక్ష్మినారాయణ, వైద్యాధికారిని భాగ్యలక్ష్మి హాజర య్యారు. ముందుగా లఘుచిత్రాల ద్వారా ప్రస్తుత సమాజంలో ఎదురయ్యే సమస్యలు (బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు)ను ఎలా ఎదుర్కోవాలనే విషయాలపై బాలికలకు వివరించారు. శాంతలక్ష్మి మాట్లాడుతూ బాలికలకు చిన్న వయసులో వివాహం చేయడం వల్ల తలెత్తే సమస్యలను వివరించారు. ఆడపిల్లకు 18, మగ పిల్లలకు 21 ఏళ్లు నిండిన తరువాతే వివాహ ప్రయత్నాలు చేయాలని సూచించారు. బాల్య వివాహం చేసుకున్నా, నిర్వహించినా, సహకరించినా, హాజరైన ప్రతి ఒక్కరూ శిక్షార్హులు అని, వారికి రెండేళ్ల జైలు, రూ. లక్ష జరిమానా లేదా రెండు విధిస్తారని తెలిపారు. బాల్య వివాహం గురించి తెలిస్తే టోల్ ఫ్రీ నంబర్లు 1098, 100, 112కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఆర్‌డిటి మడకశిర ఆర్‌డి మల్లికార్జున మాట్లాడుతూ సమాజంలో బాలలను, వారి జీవించే హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరి ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ అనురాధ, వైద్య సిబ్బంది అనుష, మహిళా పోలీస్ నాగలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు, చిన్నారులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్‌డిటి మడకశిర రీజినల్ డైరెక్టర్ మల్లికార్జున

పింఛన్లను ప్రవేశపెట్టిన ఘనత ఎన్టీఆర్‌దే : టిడిపి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

దేశంలోనే ప్రప్రథమంగా సామాజిక భద్రత పింఛన్లు అమలు చేసిన ఘనత టిడిపి వ్యవస్థాపకులు ఎన్టీఆర్‌కే దక్కుతుందని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, 25వ వార్డు ఇన్‌ఛార్జి భీమనేని ప్రసాద్‌నాయుడు కొనియాడారు. వారు మంగళవారం పట్టణంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవపురంలోని 25వ వార్డులో పింఛనుదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సిఎం చంద్రబాబు పింఛను సొమ్ము పంపిణీ చేస్తున్నారన్నారు. మిగిలిన పథకాలను కూడా ఒక్కొక్కటికిగా అమలు చేస్తారన్నారు. ప్రజల అభివృద్ధి కోసం సిఎం అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో ఏడాదికి రూ. 250 మాత్రమే పెంచగా సిఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ఒక్కసారిగా రూ. వెయ్యి పెంచారన్నారు.

ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేత

హిందూపురం : మున్సిపాలిటీ పరిధిలోని ముదిరెడ్డిపల్లి సచివాలయ కార్యదర్శి అశ్వర్థ సొంత ఖర్చులతో మంగళవారం అనంతపురం వెళ్లి అక్కడ ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలు నాగమ్మకు పింఛను అందజేశాడు. అశ్వర్థ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎన్టీఆర్ పింఛను పంపిణీలో భాగంగా లబ్ధిదారులకు సకాలంలో పింఛను సొమ్ము అందించాలనే ఉద్దేశంతో ఆసుపత్రికి వచ్చి పింఛను అందజేశానని తెలిపారు.

ధర్మవరం : పింఛను పంపిణీ చేస్తున్న నాయకులు పరిశే సుధాకర్, ప్రసాద్‌నాయుడు

ప్రభుత్వ స్థలాల్లో షెడ్, పునాదులు తొలగింపు

ప్రజాశక్తి-కదిరి టౌన్

గత ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని ప్రభుత్వ భూమి, స్థలాలను ఆక్రమించి భూ దందాలు, కబ్జాలకు పాల్పడి యథేచ్ఛగా చేపట్టిన అక్రమ నిర్మాణాలపై నూతన ప్రభుత్వం ఉక్కు పాదం మోపడంతో కబ్జాదారుల గుండెల్లో గూబులు రేగుతోంది. వివరాలు.. కాంగ్రెస్ హయాంలో పట్టణంలోని సర్వే నెంబర్ 206లో కొందరికి ఇళ్ల పట్టాలివ్వగా ఆ తర్వాత కాలంలో జిల్లా కలెక్టర్ రద్దు చేశారు. వైసిపి అధికారంలోకి రావడంతో కదిరిలో ఆ పార్టీ నేతలు భూదందాలకు పాల్పడుతూ రూ. కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలంలో షెడ్ ఏర్పాటు చేయడంతో పాటు పునాదులు నిర్మించారు. వారి అక్రమాలపై అధికారులు చర్యలు చేపట్టారు. పట్టణంలోని అడపాల వీధిలో సర్వేనెంబర్ 206లో రూ. కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలంలో వైసిపి నాయకుడు కుర్లి శివారెడ్డి అక్రమంగా నిర్మించిన షెడ్డును జెసిబితో కూల్చివేశారు. బైపాస్ రోడ్డు పక్కనే సర్వే నెంబర్-1738లో వైసిపికి చెందిన కొందరు నేతలు రూ. కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి పునాదులు నిర్మించారు. ఆ పునాదులను జెసిబితో తొలగించారు. అధికారులు ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు, పునాదులను తొలగించడం పట్ల పట్టణవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న అధికారులు

ఐచర్ ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి

తలుపుల : మండలంలోని పల్లవాండ్లపల్లి, బైగారిపల్లి గ్రామాల సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమా దంలో ఒకరు మృతి చెందారు. వివరాలు.. కదిరి పట్టణానికి చెందిన శేషాద్రి జియో కంపెనీలో పని చేస్తుండేవాడు. విధులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై ఓబుళరెడ్డిపల్లి నుంచి తలుపులకు వెళ్తుండగా కదిరి నుంచి వెలిచెలమల గ్రామానికి వెళ్తున్న ఐచర్ పల్లవాండ్లపల్లి గ్రామ సమీపంలో ఢీకొనడంతో శేషాద్రి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు హుటాహుటిన శేషాద్రిని తలుపులకు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

కమిషనర్ దృష్టికి మున్సిపల్ కాంప్లెక్స్, మార్కెట్ సమస్యలు

హిందూపురం : మున్సిపాలిటీ వాణిజ్య భవన సముదాయంతో పాటు మార్కెట్‌ను పూర్తి స్థాయిలో వినియోగం లోకి తీసుకొచ్చి వ్యాపారులకు న్యాయం చేయాలని కౌన్సిలర్ రాఘవేంద్ర, జనసేన నాయకులు నిమ్మకాయల రాములు కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డిని కోరారు. కమిషనర్ మంగళవారం వాణిజ్య సముదాయం, మార్కెట్‌ను సందర్శించగా వ్యాపారులు సమస్యలను ఏకరువు పెట్టారు. వాణిజ్య సముదాయ భవనం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిందని సెక్యూరిటీ ఏర్పాటు చేయాలని, మార్కెట్ పరిసరాల్లో అపరిశుభ్రం నెలకొందని, స్వీపర్లను నియమించాలని కోరారు. వాణిజ్య సముదాయ భవనంపై గదులను వెంటనే అద్దెకు ఇచ్చేలా చూడాలని కోరారు. స్పందించిన కమిషనర్ సమగ్రంగా పరిశీలించి వాణిజ్య సముదాయంతో పాటు మార్కెట్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని తెలిపారు.

కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న కౌన్సిలర్ రాఘవేంద్ర

ఫైర్ సేఫ్టీ లేని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

మడకశిర : నియోజకవర్గ వ్యాప్తంగా ఫైర్ సేఫ్టీ లేని ప్రయివేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అగ్నిమాపక శాఖ అధికారి తిరుపాల్‌కు వినతి పత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్ మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రయివేట్ విద్యాసంస్థల్లో విద్యను వ్యాపారంగా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీస సౌకర్యాలు లేకున్నా విద్యాశాఖ అధికారులు అనుమతి ఇస్తున్నారని విమర్శించారు. గుడిబండలోని సైనిక్ వర్ష పాఠశాలలో కనీస సౌకర్యాలు లేవన్నారు. అలాంటి పాఠశాలలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నరేంద్ర, ఆది, పాల్గొన్నారు.



అగ్నిమాపక శాఖ అధికారి తిరుపాల్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

అధ్యాపకుడు వీరాస్వామికి అవార్డు

ప్రజాశక్తి -కదిరి అర్బన్

కదిరి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగంలో సీనియర్ లెక్చరర్‌గా పని చేస్తున్న డాక్టర్ వేముల వీరాస్వామి ప్రతిష్ఠాత్మక జ్యువెల్ ఆఫ్ ఇండియా అవార్డుకు ఎంపికయ్యారు. కెటికె ఫౌండేషన్, న్యూఢిల్లీ సంస్థ ఆధ్వర్యంలో దేశంలో వివిధ రంగాల్లో ప్రతిభావంతు లైన వ్యక్తులను ఎంపిక చేసి వారిని అవార్డులతో సత్కరించడ మే కెటికె ఫౌండేషన్ న్యూ ఢిల్లీ సంస్థ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. సాంకేతిక విద్యా రంగంలో డాక్టర్ వీరాస్వామి కనబరిచిన ప్రతిభకు గుర్తింపుగా ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఆ సంస్థ ఛైర్మన్ మేజర్ యశ్‌పాల్‌సింగ్(రిటైర్డ్) తెలిపారు. జూన్ 16వ తేదీ న్యూ ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ వీరాస్వామి వర్చువల్‌గా ఈ అవార్డు అందుకున్నారు. డాక్టర్ వీరాస్వామికి అవార్డు దక్కడం పట్ల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్, సిబ్బంది అభినందనలు తెలిపారు.

'మొక్కలు నాటి పచ్చదనం పెంచుదాం'

ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనం అభివృద్ధికి కృషి చేయాలని పర్యావరణవేత్త భాస్కర్ నాయుడు పిలుపునిచ్చారు. 'వన మహోత్సవం'లో భాగంగా మంగళవారం కొత్తచెరువులోని సత్యసాయి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద విరివిగా మొక్కలు నాటాలని, తద్వారా కాలుష్యాన్ని నియంత్రించుకోవచ్చు అన్నారు. చెట్ల ద్వారా ఆక్సిజన్ ఉత్పత్తి అవుతుందని, ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో లింగం నాయుడు, రాఘవేంద్ర, బెల్లం సాయి, లైటింగ్ రాము, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

మొక్క నాటుతున్న పర్యావరణవేత్త భాస్కర్‌నాయుడు

మొక్కలు నాటించాలని కలెక్టర్‌కు వినతి

పుట్టపర్తి అర్బన్ : ప్రస్తుత వర్షాకాలంలో పాఠశాల విద్యార్థులచే విరివిగా మొక్కలు నాటించాలని, ఆ మేరకు సంబంధిత అధికారులను ఆదేశించా లని కోరుతూ ప్రముఖ పర్యావరణవేత్త డాక్టర్ భాస్కర్ నాయుడు బృందం కలెక్టర్ అరుణ్‌బాబును కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ బృందం తలమర్ల హరికృష్ణ, జ్యోతి బాబు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

వసతి గృహాల్లో సౌకర్యాలు కల్పించాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి

హిందూపురం : ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు అనుబంధంగా ఉన్న వసతి గృహాల్లో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు మంగళవారం సాయంత్రం పట్టణంలోని పాఠశాలకు అనుబంధంగా ఉన్న బిసి బాలుర, కళాశాల వసతి గృహాలను సందర్శించి విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నారు. బాబావలి మాట్లాడుతూ ప్రభుత్వ వసతి గృహాలు సమస్యలకు నిలయాలుగా మారాయన్నారు. కళాశాలలకు అనుబంధంగా ఉన్న బిసి బాలికల వసతి గృహానికి సొంత భవనం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో పాటు కళాశాలకు అనుబంధంగా ఉన్న వసతి గృహంలో కనీస సౌకర్యాలు లేవన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలను పరిష్కరించని పక్షంలో విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

విద్యార్థుల అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

బుక్కపట్నం : విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపల్ రవిసాగర్ తెలిపారు. స్థానిక డైట్ కళాశాలలో మంగళవారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మొదటి సంవత్సరం విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. అలాగే 2024-26 బ్యాచ్‌కు ఘన స్వాగతం పలికారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులు భవిష్యత్తులో ఉపాధ్యాయులై వృత్తికే వన్నె తెచ్చేలా విద్యాబోధన చేయాలని, పిల్లలను భావిభారత పౌరులుగా తీర్చి దిద్దాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పిడి రామకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు..

వసతి గృహాల బకాయి బిల్లులు చెల్లించాలి

ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్

రాష్ట్ర వ్యాప్తంగా బీసీ, ఎస్సీ ప్రభుత్వ హాస్టళ్లకు సంబంధించి పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని సామాజిక విద్యార్థి సంక్షేమ సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు నరసింహమూర్తి, ప్రధాన కార్యదర్శి ఉట్టి దినేష్ కొత్త చెరువులో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలలు, కళాశాల యాజమాన్యాలపై స్థానిక విద్యాశాఖ అధికారులు స్పందించడం లేదని, ఉన్నతాధికారుల స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే గత ప్రభుత్వంలో హాస్టళ్ల నిర్వహణలో పెండింగ్‌లో ఉ8 నెలల బిల్లులను వెంటనే చెల్లించాలని కోరారు. విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడంలో ఎలాంటి లోపాలు జరగకుండా చూడాలన్నారు.

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం

ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి

(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ